# ఉపకారానికి పోతే...



ఇంట్లో ఇల్లాలూ, బయట సైకిలు... ఈ రెండూ మధ్యతరగతి కుటుంబానికి తోడూ-నీడాను. ఈ రెండూ కూడా చివరివరకూ శక్తి క్షీణించేదాకా సేవ చేస్తూనే ఉంటాయి.

రాజు సైకిల్ టైర్లు అరిగి అరిగి చిల్లులు పడి, లోపలి ట్యూబులు చెడి, చీటికిమాటికి పంచర్లు పడడం మొదలుపెట్టాయి. ట్యూబులకు మాట్లు వేయించి- అదే... పంచర్లు వేయించి, టైర్లు కుట్టించి, లేదా- లోపల చిల్లి దగ్గర టైరు ముక్కలు పెట్టించి ఎలాగో రాజు కాలాన్ని తోసుకుపోతూంటే... సైకిల్ అతన్ని ఈడ్చుకువెళ్తోంది.

రెండు టైర్లూ, రెండు ట్యూబులు కూడా పూర్తిగా జీర్ణావస్థకి వచ్చి, రిటైర్మెంట్ స్టేజిని రీచయ్యాయి. అయినా... వాటిని రిటైర్ చేయకపోవడంతో అవి తరచూ సత్యాగ్రహం చేసి, మొండికెత్తడం ప్రారంభించాయి. అందులోనూ వేసవికాలం రావడంతో, ఎండలు ముదరడంతో ఈ పంచర్ల బాధ- ఎండ బాధకంటే ఎక్కువైంది. నిజానికి- ఈ రిపేరుకి పెట్టే డబ్బుతో కొత్తవే కొనుక్కోవచ్చు. కాని, అంత డబ్బు ఒక్కసారే తన దగ్గర ఉండొద్దూ?!

ఈ పంచర్ల బాధ ఇంతా అంతా కాదు. వెళ్తూ వెళ్తూండగా ఉన్నట్లుండి గాలి పోవడం.., ఆపద్బాంధవుడైన పంచర్‌వాలా కనిపించేవరకూ 'నటరాజా సర్వీసు' చేయడం.., పంచర్ వేయించాక అదృష్టం బాగుంటే తిన్నగా గమ్యాన్ని చేరుకోవడం.., లేకుంటే మరో పంచరయి, ఇంకో ఆపద్బాంధవుడిని వెతుక్కుంటూ వెళ్లడం పరిపాటయిపోయింది.

ఆఫీసుకి వెళ్లే దారిలో పంచరయితే ఆఫీసుకి ఆలస్యంగా వెళ్లడం, అక్కడ రెడ్ ఎంట్రీతోపాటు చివాట్లు తినడం, రాత్రిపూట పంచరయితే ఉసూరుమంటూ ఇంటికి నడిపించుకు వెళ్లడం కూడా ఇంచుమించు దినచర్య అయింది.

ఇంక ఆ బాధ పడలేక, ఆ నెలలో నలభై రూపాయలు అప్పు చేసి, రెండు చక్రాలకూ కొత్త టైర్లు, కొత్త ట్యూబులు వేయించాడు రాజు. పడుచు మేకప్ చేసుకున్న ముసలి దానిలాగా, వృద్ధ వేశ్యమాతలాగా ఉన్న ఆ సైకిల్‌ని ఎక్కి 'ఇంపాలా కారు' ఎక్కినంత ఆనందంగా, జోరుగా వస్తున్నాడు రాజు.

దారిలో మునిసిపల్ ప్లే గ్రౌండ్‌లో చిన్న పిల్లలు ఆడుకొంటున్నారు.

'వాళ్ళే అదృష్టవంతులు' అని మనసులోనే మురిసిన రాజు కంటికి- ఆ గ్రౌండ్ గేటు దగ్గర పగిలిపోయిన సీసా పెంకులు కొనలుదేరి ఉండడం కనిపించింది.

'అరే పాపం! ఈ పిల్లలు చూసుకోకుండా ఉషారుగా వచ్చి వీటిమీద కాలు వేశారంటే ఇంకేం లేదు'... అనుకుని సైకిల్‌ని సడన్ బ్రేక్ వేసి ఆపి, దిగి స్టాండ్ వేసి, ఆ ముక్కల్ని జాగ్రత్తగా ఏరి గోడవారగా పారవేశాడు రాజు.

ఒక మంచి పని చేసిన సంతోషంతో తిరిగి సైకిలెక్కి బలంగా తొక్కాడు రాజు. సైకిల్ కదిలిందో-లేదో... తుస్సుమంటూ వెనక చక్రం గాలిపోయింది. 'ఏమిటా...' అని దిగి చూస్తే, వ్రేలెడు పొడుగున్న కొనదేరిన సీసా పెంకు చక్రాన్ని కోసేసింది.

కొత్త టైరు, ట్యూబు చిల్లు పడ్డందుకు బాధపడినా ఒక మంచిపని చేసినందుకు సంతోషిస్తూ, 'ఆపద్బాంధవుని' కోసం వెతుక్కుంటూ నడక సాగించాడు.

- భారత మిత్రం... *28 మే ' 78*